సాక్షి
రంగారెడ్డి

సోమవారం । 15 । జూలై । 2024



పండ్ల చెట్లకు 'బంక'

పండ్ల చెట్లకు బంక తెగుళ్ల నివారణకు కృషి విజ్ఞాన్ కేంద్రం క్రీడా నిపుణుడు సలహాలు, సూచనలు చేశారు. 8లో▸



యమ డేంజర్

నిత్యం వందలాది వాహనాలు తిరిగే కూడలిలో ప్రమాదం పొంచి ఉంది. ఏ మాత్రం ఆదమరిచినా అంతే సంగతులు. 8లో▸



సూర్యగిరి ఘటం

ప్రజాభవన్‌లో ఆదివారం మహేశ్వరం మండలం రావిర్యాల సూర్యగిరి రేణుకా ఎల్లమ్మ ఘటాన్ని ఊరేగించారు. 8లో▸

న్యూస్‌రీల్

లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు నిధులు కేటాయించండి

మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మెల్యేల వినతి



మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు

షాద్‌నగర్: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలో నిర్మించ తలపెట్టిన లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని కోరుతూ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని షాద్‌నగర్, చేవెళ్ల, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, కాలె యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యేలు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని, ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే షాద్‌నగర్, పరిగి, చేవెళ్ల, తాండూరు నియోజకవర్గాల ప్రజల సాగునీటి కష్టాలు తీరుతాయన్నారు. దీనికి స్పందించిన మంత్రి ప్రాజెక్టు నిర్మాణానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపునకు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన కాలె యాదయ్య



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం నగరంలో ఆయనను తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో వెళ్లి కలిశారు. అనంతరం వారు నగరంలోని ప్రజాభవన్‌లో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పరిగి ఎమ్మెల్యే రామోహన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు.

నేటి నుంచి మాన్సూన్ 'రేగట్టా'

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్, యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించే ప్రతిష్టాత్మక జూనియర్ నేషనల్ రేగట్టా 'మాన్సూన్ రేగట్టా' సోమవారం నుంచి ప్రారంభం కానుంది. హుస్సేన్ సాగర్ వేదికగా జరిగే పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు తమిళనాడు, మధ్యప్రదేశ్, మైసూర్, ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన 140 మంది సెయిలర్స్ పాల్గొంటున్నారు. ఇందులో దాదాపు 40 శాతం మంది తెలంగాణ నుంచే పాల్గొనడం విశేషం. ఈసారి పోటీల్లో ఐఎల్ సీఏ4, 29ఈఆర్, ఇంటర్నేషనల్ 420 అనే నూతన బోట్లను తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సుహైమ్ షేక్ మాట్లాడుతూ.. జాతీయ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్‌లో ఉత్తమ సెయిలర్‌కు ఎస్‌హెచ్ బాబు మెమోరియల్ ట్రోఫీని అందిస్తారని పేర్కొన్నారు.

పరుగెత్తించి.. హత్యకు యత్నించి..

ట్రాఫిక్ హోంగార్డుపై ఆటో వాలా దాడి

బంజారాహిల్స్: రాంగ్‌రూట్‌లో వస్తున్నావని ప్రశ్నించిన ట్రాఫిక్ హోంగార్డుపై ఆటోవాలా దౌర్జన్యానికి పాల్పడ్డాడు. హోంగార్డును ఉరికించి తీవ్రంగా కొడుతూ బండరాయితో హత్య చేసేందుకు యత్నించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ ముత్యాల మెహర్ రాకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ హోంగార్డు జయప్రకాష్ కృష్ణానగర్ ఇందిరానగర్ చౌరస్తాలో విధులు నిర్వహిస్తున్నాడు. ఎల్లారెడ్డిగూడకు చెందిన ఆటోడ్రైవర్ ఎండీ ఒమర్ షరీఫ్ ఇందిరానగర్ గడ్డ నుంచి రాంగ్‌రూట్‌లో కృష్ణానగర్ వైపు వస్తున్నాడు. ఇదేం పద్ధతి అని, రాంగ్‌రూట్‌లో ఎందుకు వస్తున్నావని హోంగార్డు ప్రశ్నించాడు. నన్నే ఆపుతావా అంటూ ఆగ్రహంతో ఊగిపోయిన ఆటోడ్రైవర్ షరీఫ్.. హోంగార్డుపై విచక్షణారహితంగా పిడిగుద్దులతో గాయపర్చాడు. నిందితుడి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించిన హోంగార్డును వెంబడించి చితకబాదాడు. అందరూ చూస్తుండగానే అక్కడ ఉన్న బండరాయిని ఎత్తుకుని హోంగార్డును హత్య చేసేందుకు యత్నించగా బాధితుడు త్రుటిలో తప్పించుకుని నేరుగా వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గంటల వ్యవధిలోనే పరారీలో ఉన్న ఆటోడ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నూతన కిట్లతో తాటిచెట్లు ఎక్కుతున్న గీతకార్మికులు





ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మోకు, లొట్టి బహూకరిస్తున్న గీత కార్మికులు

వృత్తిదారులకు అండగా ఉంటాం

కల్లుగీత కార్మికులను ఆదుకుంటాం

- రాబోయే రోజుల్లో జిల్లా సమగ్రాభివృద్ధి
- స్పష్టం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- లష్కర్‌గూడలో 'కాటమయ్య రక్షణ కవచం' కిట్ల పంపిణీ
- తాటివనంలో స్వయంగా కిట్ల పనితీరు పరిశీలన



సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ శశాంక

అబ్దుల్లాపూర్‌మెట్: వృత్తిదారులకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ గ్రామంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం 'కాటమయ్య రక్షణ కవచం' పేరుతో రూపొందించిన కిట్లను గీత కార్మికులకు అందజేశారు. సుమారు 500 మంది గీత కార్మికులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం కల్లు గీత కార్మికులతో మాట్లాడి వృత్తిపరంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు.

తాటివనంలో తిరిగి..

అంతకు ముందు స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి తాటివనంలోకి చేరుకున్నారు. వృత్తిదారులు కిట్లను ధరించి, వాటి పనితీరును ప్రదర్శించగా సీఎం పరిశీలించారు. వాటిని రూపొందించిన హైదరాబాద్ ఐఐటీ విద్యార్థులు మాలోతు పూర్ణ బృందాన్ని అభినందించారు. వన మహోత్సవంలో భాగంగా ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు గీత కార్మికులు తాటి, ఈత చెట్లు అంతరించిపోతున్నాయని, ఈ వనాల కోసం ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని, వృత్తిదారులకు టీవీఎస్ మోపెడ్ వాహనాలు ఉచితంగా అందజేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేయగా ఆయన సుముఖత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేశం, దయానంద్‌గుప్తా, ఏవీఎన్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, తెలంగాణ స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, స్టేట్ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ చైర్మన్ చెవుల స్వప్న, వైస్ చైర్మన్ చామ సంపూర్ణ పాల్గొన్నారు.

ఐటీ పరిశ్రమలు రావాలి

విజయవాడ జాతీయ రహదారి వెంట ఐటీ, అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. కోహెడ పండ్ల మార్కెట్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

అన్ని వర్గాలకు న్యాయం

కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుంది. ఆరు నెలల్లోనే ఐదేళ్ల కార్యక్రమాలు రూపొందించాం. ప్రభుత్వ కార్యక్రమాల్లో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నాం.

– చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ, భువనగిరి

ఒక్క పైసా బెనిఫిట్ పొందలేదు

గత ప్రభుత్వ హయాంలో ఒక్క పైసా బెనిఫిట్ పొందని సామాజిక వర్గం ఏదైనా ఉందంటే అది కల్లుగీత కార్మికులే. రియల్ ఎస్టేట్ కారణంగా తాటి, ఈత చెట్లు లేకుండా పోయాయి. వృత్తి దెబ్బతింది. ప్రమాదవశాత్తు ఎవరైనా కార్మికుడు చెట్టుపై నుంచి కింద పడితే ఆ కుటుంబం అంతా చిన్నాభిన్నం అవుతుంది. హరితహారంలో భాగంగా నాటిన మొక్కల నుంచి ఆక్సిజన్ వస్తుందే కానీ ఆదాయం రావడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం తాటిఈత వనాలకు ప్రాధాన్యత ఇస్తోంది.

– పొన్నం ప్రభాకర్‌గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రాణనష్టం లేకుండా వారికి రక్షణ కిట్లను పంపిణీ చేస్తోంది. శ్రీలంకలో తాటిచెట్ల ద్వారా 80 రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. మన దగ్గర కూడా ఇలాంటి ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇస్తాం. నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాం.

– జూపల్లి కృష్ణారావు, ఎక్సైజ్‌శాఖ మంత్రి

ఆ పరిశ్రమలకు ప్రాధాన్యత కల్పిస్తాం

వృత్తి ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యత కల్పిస్తాం. వారికి అవసరమైన భూములు కేటాయించడంతో పాటు ఆర్థిక సహాయం కూడా చేస్తాం. గీతకార్మికుల పిల్లలకు ఆయా అంశాల్లో నైపుణ్యం కల్పిస్తాం.

– డి.శ్రీధర్‌బాబు, ఐటీశాఖ మంత్రి

దివ్యాంగుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ప్రభుత్వ పథకాల్లో దివ్యాంగులకు ఐదు శాతం ప్రత్యేక వాటా కేటాయించాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో ఆదివారం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా కమిటీ అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మూడో మహాసభ నిర్వహించారు. ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు కరువునెల్లి వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా పెన్షన్ రూ.6,016కు పెంచాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాక్ పోస్టుల భర్తీ కోసం వెంటనే నోటిఫికేషన్ వేయాలని, గ్రామ పంచాయితీ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల ద్వారా దివ్యాంగుల సమగ్ర సమాచారం సేకరించాలని డిమాండ్ చేశారు. కరువునెల్లి వెంకట్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కేటాయించే నిధులు దారి మళ్లుతున్నాయని ఆరోపించారు. అనంతరం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. సమావేశంలో నాయకులు రాజు, శేఖర్, నాగార్జున, శ్రీనివాస్, మహేశ్‌గౌడ్, బాల్‌రాజ్, యాదయ్య, బోడ శ్రీనివాస్, జానయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సైకిళ్లపై పెట్రోలింగ్ చేస్తూ కాలనీవాసులతో మాట్లాడుతున్న ఆదిబట్ల పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆదిబట్ల పోలీసులు పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీసీఎస్ ముందు ప్రభుత్వం నూతనంగా అందజేసిన సైకిళ్లపై తిరుగుతూ పెట్రోలింగ్ నిర్వహించారు.





బోనం.. ఘనం

గోల్కొండ కోటలో ఆదివారం మూడో బోనం పూజ అంగరంగ వైభవంగా జరిగింది. అలాగే.. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళికి తొలి బోనం సమర్పించారు. అమ్మవారికి భక్తులు ఒడిబియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.







అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశాలు పెంచేందుకు చర్యలు
- చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అమలుకు సన్నాహాలు
- నేటి నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పాఠాలు బోధిస్తున్న సిబ్బంది (ఫైల్)

షాద్‌నగర్: చిన్నారులను విద్యలో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పూర్వ ప్రాథమిక విద్యను మరింత పటిష్టం చేసేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట' అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సామగ్రి సిద్ధం

అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసి చిన్నారుల ప్రవేశాలను పెంచేందుకు ఐసీడీఎస్ (సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం) ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. బడి బాట కార్యక్రమం పూర్తయిన తర్వాత గ్రామాలు, పట్టణాల్లో బడికి రాకుండా మిగిలిపోయిన చిన్నారులను గుర్తించి వారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించనున్నారు. వారికి అక్షరాలు, అంకెలు, పాటలతో కూడిన విద్యను బోధించనున్నారు. ఇందుకు సంబంధించిన సామగ్రిని అంగన్‌వాడీ కేంద్రాల్లో అధికారులు సిద్ధం చేశారు.

కార్యక్రమాలు ఇలా..

అమ్మబాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఈనెల 15, 16 తేదీల్లో అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు, బాలికలు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, పాఠశాలల ఉపాధ్యాయులు, యువకులు, ఎన్జీవోలు, తల్లిదండ్రుల సాయంతో గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని కోరనున్నారు. అదేవిధంగా పాఠశాల, కళాశాల విద్యకు దూరంగా ఉన్న బాలికలను గుర్తిస్తారు. స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తారు.

- 18న గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ తిరిగి రెండున్నరేళ్ల వయసున్న చిన్నారులను గుర్తిస్తారు. అంగన్‌వాడీలో చిన్నారుల వివరాలు నమోదు చేయడం, బోధనా పద్ధతుల గురించి సిబ్బంది చిన్నారులకు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి పూర్వపు ప్రాథమిక విద్య గురించి వివరించి చైతన్య పరుస్తారు. ఐదేళ్లు పూర్తయిన చిన్నారులకు అంగన్‌వాడీ నుంచి ప్రీ స్కూల్ ధ్రువపత్రాన్ని అందజేయనున్నారు.
- 19న అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మొక్కలు నాటడం, కిచెన్ గార్డెన్ల ఏర్పాటు, చిన్నారులకు మరుగుదొడ్ల సదుపాయం కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.
- 20న ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ డెవలప్‌మెంట్ డే, సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తారు. చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు, తాత, నానమ్మ, అమ్మమ్మలను అంగన్‌వాడీ కేంద్రాలకు ముఖ్య అతిథులుగా ఆహ్వానించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిని సన్మానిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సంబంధించిన ఆట వస్తువులను ప్రదర్శిస్తారు.

జిల్లాలో ఏడు ప్రాజెక్టులు

షాద్‌నగర్, ఆమనగల్లు, మహేశ్వరం, శేరిలింగంపల్లి, హయత్‌నగర్, చేవెళ్ల, ఇబ్రహీంపట్నంలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో 1,600 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో పెద్దవి 1,380, చిన్నవి 220 ఉన్నాయి. ఇందులో సుమారు 1,31,630 మంది చిన్నారులకు విద్యతో పాటు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోంది.

చిన్నారుల సంక్షేమానికి..



చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తోంది. ఇందులో భాగంగా అమ్మ బాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని చేపడుతున్నాం.

– నాగమణి, సీడీపీఓ, షాద్‌నగర్

విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత



పాఠశాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రూ.3.50 కోట్ల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను పలువురు పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. విద్యాలయాన్ని ఈ నెల 17న ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్ల గురించి చర్చించారు. అనంతరం గూడూరు మాట్లాడారు. పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు బీక్యానాయక్, యాట నర్సింహ, బీచ్యానాయక్, వేణుగోపాల్, లక్ష్మయ్య, బాలరాజు, రామకృష్ణ, శంకర్, రాంచందర్‌నాయక్, జగన్‌గౌడ్, శ్రీను జవహర్, హీరాసింగ్, రాజేశ్, యాదయ్య, షాబుద్దీన్, శ్రీకాంత్ ఉన్నారు.

సైకిల్‌ను ఢీకొన్న వాహనం

వ్యక్తి మృతి



బాల్‌రాజ్ (ఫైల్)

చేవెళ్ల: సైకిల్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధి దామరగిద్ద బస్‌స్టేజీ, హెచ్‌పీ పెట్రోల్ పంపు సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి హస్తేపూర్ గ్రామానికి చెందిన కె.బాల్‌రాజ్(36) రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో దంపతులు గొడవపడ్డారు. దీంతో బాల్‌రాజ్ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. ఈ క్రమంలో బస్టాప్ సమీపంలో సైకిల్‌పై వెళ్తున్న అతన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో డీలర్ తీవ్రగాయాలతో రోడ్డుపై పడున్నాడు. రాత్రి వేళ ఎవరూ గుర్తించకపోవడంతో అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు క్షతగాత్రున్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తిగా భావించగా.. ఆదివారం స్థానికులు కొందరు హస్తేపూర్ రేషన్ డీలర్‌గా గుర్తించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని..

బాలుడి ఆత్మహత్య



శుభంకుమార్ మృతదేహం

కొత్తూరు: మద్యానికి బానిసైన కొడుకుని తల్లిదండ్రులు మందలించడంతో రైలు పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. తల్లిదండ్రులతో కలిసి పట్టణంలో నివాసం ఉంటున్న శుభంకుమార్(17).. కొంత కాలంగా మద్యానికి బానిసై.. జులాయిగా తిరుగుతున్నాడు. ఇది సరైంది కాదని కన్నవారు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన కుమార్.. ఈ నెల 13న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి.. ఆదివారం రైలు పట్టాలపై శవమై కనిపించాడు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా.. మృతున్ని గుర్తించారు. ఆత్మహత్యగా అనుమానించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆశ్రమానికి వృద్ధుడి తరలింపు



వృద్ధుడిని తీసుకెళ్తున్న పోలీసులు

యాచారం: ప్రాణాపాయ స్థితిలో ఉన్న గుర్తు తెలియని వృద్ధుడిని పోలీసులు ఆదివారం అనాథ ఆశ్రమానికి తరలించారు. మండల కేంద్రం సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో వృద్ధుడు పడున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లారు. వివరాలు అడిగినా చెప్పే స్థితిలో లేకపోవడంతో.. వృద్ధుడిని గునుగల్–ఆగాపల్లి గ్రామాల మధ్య ఉన్న అనాథ ఆశ్రమానికి తరలించారు.

యమ డేంజర్

- కూడలిలో పొంచిఉన్న ప్రమాదం
- కుంగిన డ్రైనేజీ పైకప్పు.. వాహనదారుల ఇక్కట్లు



పగిలిన డ్రైనేజీ పైకప్పు భాగం

కడ్తాల్: నిత్యం వందలాది వాహనాలు పరుగులు తీసే కూడలిలో ప్రమాదం పొంచి ఉంది. భూగర్భాన నిర్మించిన మురుగు కాలువ పైకప్పు కుంగి, రంధ్రాలు ఏర్పడి మృత్యువు మాటువేసింది. వాహనచోదకులు ఏమాత్రం ఆదమరిచినా ప్రాణాలు పోవడమో, ఆస్పత్రి పాలు కావడమో ఖాయమని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

భూగర్భాన కాలువ

శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కొన్నేళ్ల క్రితం, మండల కేంద్రం నుంచి సమీపంలోని తలకొండపల్లి కూడలి మీదుగా భూగర్భ మార్గాన రోడ్డుకు ఇరువైపులా వర్షం నీరు వెళ్లేందుకు రెండు కిలో మీటర్ల డ్రైనేజీ నిర్మించారు. ఈ కూడలి నుంచే షాద్‌నగర్, తలకొండపల్లి తదితర ప్రాంతాలకు చిన్న, పెద్ద వాహనాలు పరుగులు తీస్తుంటాయి. ఈ క్రమంలో డ్రైనేజీ పైకప్పు కుంగడంతో పాటు, రెండు చోట్ల భారీగా రంధ్రాలు ఏర్పడ్డాయి.

పట్టించుకోని అధికారులు

డ్రైనేజీ పైకప్పు కుంగి నెల రోజులు గడుస్తున్నా.. సంబంధిత అధికారులు ఎవరు కూడా అటువైపు చూసిన పాపాన పోలేదని పరిసర ప్రాంత ప్రజలు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. ప్రధాన కూడలి కావడంతో నిత్యం వాహనాల రాకపోకలు జరుగుతుంటాయని, పగటి పూట ఎలా ఉన్నా.. రాత్రి వేళలో ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదని పేర్కొంటున్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి మరమ్మతుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



కుంగిన పైకప్పు

ప్రజాభవన్‌లో 'సూర్యగిరి' ఘటం

ఊరేగించిన ఆలయ ప్రధాన పూజారి



పూజారి నెత్తిన ఘటాన్ని పెడుతున్న సీఎం, డిప్యూటీ సీఎం

మహేశ్వరం: తెలంగాణ ప్రజాభవన్‌లో కొలువుదీరిన నల్ల పోచమ్మ బోనాల పండుగ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవంలో మహేశ్వరం మండలం రావిర్యాల సూర్యగిరి రేణుకా ఎల్లమ్మ ఘటాన్ని.. ఆ ఆలయ ప్రధాన పూజారీ మీగడ రామస్వామి కుమారుడు కాశీనాథ్.. సర్వాంగ సుందరంగా అలంకరించి ఊరేగించారు. వేడుకలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్, జూపల్లి కృష్ణా రావు తదితరులు ఘటానికి ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు. మంత్రుల ఆధ్వర్యంలో జరిగిన బోనాల పండుగలో రావిర్యాల ఎల్లమ్మ ఘటానికి మంత్రులు పూజలు చేయడం, వారి సమక్షంలో ఘటాన్ని ఎత్తుకోవడం సంతోషంగా పూజారి కాశీనాథ్ అన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే సబితారెడ్డి



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధి అల్మాస్‌గూడ 26వ డివిజన్‌లో మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి తన మాతృమూర్తి కళావతి స్మారకార్థం రూ.25 లక్షలతో తిరుమలనగర్ కాలనీ ఫేస్-3లో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె దాత రాంరెడ్డిని అభినందించారు. అనంతరం కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రామిడి కవిత, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఈఓ కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్ట్

ఎనిమిది మంది రిమాండ్

బంజారాహిల్స్: జీతాలు ఇవ్వడం లేదన్న కోపంతో సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈఓను అపహరించి నిర్బంధించి దొంగతానికి పాల్పడిన కేసులో ఎనిమిది మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను జూబ్లీహిల్స్ క్రైమ్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి 84 కొత్త ల్యాప్‌ట్యాప్‌లు, నాలుగు కార్లు, ఒక బైక్, 18 మొబైల్ ఫోన్లు, మూడు పాస్‌పోర్టులను సీజ్ చేశారు. ఈ నెల 10న నందగిరిహిల్స్‌లో నివసించే గిగ్‌లెజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈఓ వాకాటి రవిచంద్రారెడ్డిని అదే సంస్థలో పనిచేస్తున్న ఎనిమిది మంది ఉద్యోగులు తమకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదంటూ కారులో ఎక్కించుకుని నాగర్‌కర్నూల్ సమీపంలోని ఓ హోటల్‌లో నిర్బంధించిన విషయం తెలిసిందే. బాధితుడి తల్లి వాకాటి మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కిడ్నాపర్ల నుంచి రవిచంద్రారెడ్డిని రక్షించారు. ఈ ఘటనలో కిడ్నాప్‌నకు పాల్పడిన ఆకుల జగదీష్, కొలగట్ల గౌతమ్, తాతా శివశంకర్ రెడ్డి, సూదగాని సుజిత్‌కుమార్, కమల్‌తేజ, షేక్ ఆజాద్, కర్నాటి ముఖేష్, రాకేష్ అలియాస్ ప్రవీణ్‌లను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొంతకాలంగా తమకు రవిచంద్రారెడ్డి జీతాలు ఇవ్వడం లేదని, సుమారు 12 నుంచి 15 వందల మంది యువతీ యువకుల నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల ఉద్యోగాల కోసం రూ.17 కోట్ల వరకు వసూలు చేశారని, ఈ విషయాలు మాట్లాడుకుందామనే ఆయనను తీసుకెళ్లినట్లు నిందితులు పోలీసుల దర్యాప్తులో వెల్లడించారు. అయితే తనను కిడ్నాప్ చేసి హత్య చేసేందుకు పథకం వేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అరెస్టైన వారిలో చాలామంది కన్సల్టింగ్ సంస్థలు, ప్లేస్‌మెంట్లు నిర్వహిస్తూ వివిధ సంస్థల్లో యువతీ యువకులను బ్యాక్‌డోర్‌లో రిక్రూట్ చేస్తున్నారని, రవిచంద్రారెడ్డి వద్ద కూడా అలాగే నియమించినట్లు తేలింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



వాహనంలో పశువులు

యాచారం: అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకున్నారు. నల్లగొండ జిల్లా మల్లేపల్లి పశువుల సంత నుంచి ఆదివారం సాయంత్రం ఓ వాహనంలో మూడు ఆవులు, 6 కోడెలను సాగర్ రోడ్డు మార్గం గుండా తుక్కుగూడకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మాల్ చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా.. విషయం వెలుగు చూసింది. డ్రైవర్ శంకర్‌ను అదుపులోకి తీసుకుని, పశువులను నగరంలోని గోశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉందని సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ పైడి నాయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లక్ష్మిగూడ ప్రాంతానికి చెందిన నరేందర్ మార్కెటింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాత్రి డ్యూటీ ముగించుకుని కాటేదాన్ మీదుగా వస్తుండగా స్ప్రింగ్ డయల్ స్కూల్ సమీపంలో ఎండి ఖయ్యూం అనే వ్యక్తి బైక్‌పై అతి వేగంగా వస్తూ నరేందర్ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నరేందర్ తలకు బలమైన గాయాలు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీ ఢీకొని.. వృద్ధురాలి దుర్మరణం

గచ్చిబౌలి: రోడ్డు దాటుతున్న ఓ వృద్ధురాలిని స్కూటీ ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ భాను ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ శ్రీరాంగనర్ కాలనీకి చెందిన కామేశ్వరీ(60) ఆదివారం ఉదయం తమలపాకులు తెచ్చుకునేందుకు ఇంటి నుంచి బయటికి వచ్చింది. పాలపిట్ట సైకిల్ పార్క్ ఎదురుగా రోడ్డు దాటుతుండగా స్కూటీ ఢీకొట్టింది. తీవ్ర గాయపడిన ఆమెను.. ఓ ఆటో డ్రైవర్ కొండాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారులకు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

తండ్రిపై తనయుడి దాడి

ఘట్‌కేసర్: డబ్బులు ఇవ్వాలని తండ్రిపై దాడికి పాల్పడిని కుమారుడిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకుషాపూర్ గ్రామానికి చెందిన చింతకింది శంకరయ్య తార్నాకలోని ఎస్‌ఐఎన్‌లో పని చేశాడు. ఇతనికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రస్తుతం అతను భార్య లక్ష్మితో కలిసి గ్రామంలో నివాసం ఉంటున్నాడు శంకరయ్య పెద్ద కుమారుడు వేణుగోపాల్ కొన్ని రోజులుగా డబ్బుల కోసం తరచూ తండ్రితో గొడవ పడుతున్నాడు. శనివారం సాయంత్రం ఇంటికి వచ్చిన అతను తండ్రిపై దాడి చేశాడు. ఇదే విషయం శంకరయ్య తన సోదరుడు శ్రీనివాస్‌కు చెబుతుండగా.. అదే సమయంలో అక్కడికి వచ్చిన గోపాల్.. మరోసారి తండ్రిపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల చెట్లకు 'బంక'

- తెగుళ్ల నివారణకు చర్యలు
- సస్యరక్షణకు నిపుణుల సలహాలు



శ్రీకృష్ణ, కృషి విజ్ఞాన్ కేంద్రం క్రీడా నిపుణుడు

కందుకూరు: మామిడి, జామ, సపోట, బత్తాయి, నిమ్మ తదితర పండ్ల చెట్ల కాండంపై బంక తెగుళ్లు సోకి పంటలకు నష్టం వాటిల్లితోంది. ఈ నేపథ్యంలో తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన సస్యరక్షణ గురించి కృషి విజ్ఞాన్ కేంద్రం క్రీడా నిపుణుడు జి.శ్రీకృష్ణ రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఫైటోఫ్తోరా..

బంక తెగుళ్లలో ఫైటోఫ్తోరా, డిప్లొడియా అని రెండు రకాలు ఉన్నాయి. ఫైటోఫ్తోరా తెగులుతో బంక కారటం, బెరడు కుళ్లడం చెట్టు వేళ్లకు, మొదలు కింది భాగానికి పరిమితమై ఉంటుంది. ఈ తెగులు సోకిన చెట్ల మొదలుపై, బెరడు నుంచి పైకి ధారాళంగా బంక కారుతుంది. బెరడు మీద కారిన ఈ బంక గట్టిపడి మట్టి రంగుగా మారుతుంది. ఇటువంటి బెరడు నల్లబడి నిలువుగా పగులుతుంది. ఈ బంకను గోకివేస్తే అడుగున ఉన్న కాండం భాగం కూడా కొంచెం కుళ్లినట్లు కనబడుతుంది. ఈ తెగులు భూమికి దగ్గరగా కాండం మీద ఆరంభమై, వేళ్ల మీదికి కూడా పాకుతుంది. అయితే వేళ్ల మీద బంక కారడం అంత స్పష్టంగా కనబడకపోవచ్చును. నీరు సరిగా ఇంకిన భూముల్లో తెగులు ఎక్కువగా వస్తుంది. అంట్లు చాలా కిందకు కట్టి, ఆ అంట్ల కలయిక మట్టికి తగిలేటట్లు, లేదా లోతుగా నాటినప్పుడు తడి మన్ను అంట్ల కలయిక మీద ఎక్కువగా ఉన్నప్పుడు ఈ తెగులు వ్యాపిస్తుంది.

డిప్లొడియా..

డిప్లొడియా బంక తెగులుతో చెట్లు మొదలు పై భాగాన, ముఖ్యంగా పంగల్లో బంక కారటం, బెరడు కుళ్లుట గమనించవచ్చు. ఈ తెగులు సోకిన స్థలంపై బెరడు నల్లబడి, దాని కింద కొయ్య భాగం నల్లగా మారుతుంది. ఈ బంక తెగుళ్లతో కొమ్మలు ఎండుట, చెట్లు క్షీణించుట జరుగుతుంది. వేరు కుళ్లినందు వలన చెట్లు ఎక్కువ పూత పట్టడం, కాయ ముదిరే లోపలే చెట్లు చచ్చిపోతుంటాయి.

నివారణ

మురుగు నీరు పోయే అవకాశమున్న పొలాల్లో బత్తాయి(చీనీ) చెట్లు నాటాలి. అంటు కలయిక మట్టిలో పూడిపోయేటట్లు లోతుగా నాటొద్దు. చెట్టు మొదలు చుట్టూ మట్టిని ఎగదోయొద్దు. చెట్టు చుట్టూ 1.5 అడుగుల దూరంలో పిల్ల పాదు కట్టి, దానికి బయట మాత్రమే నీరు కట్టాలి. దీనినే డబుల్ రింగ్ పద్ధతిగా పిలుస్తారు. పారే నీరు రోగం ఉన్న చెట్టు నుంచి రోగం లేని చెట్టు పాదులోకి పారకుండా జాగ్రత్త పడాలి. పదునైన కత్తితో బంక కారి కుళ్లిన బెరడును పూర్తిగా గీకి, బోర్డోపేస్ట్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ పేస్టు పూయాలి. బత్తాయి చెట్లకు ఏటా మొదళ్లపై 2 అడుగుల ఎత్తు వరకు బోర్డోపేస్ట్ పూయటం మంచిది. పక్షం రోజులు వ్యవధిలో ఒక శాతం కార్బండజిమ్ మందును రెండు సార్లు చెట్టుపై కొమ్మలు తడిచేలా పిచికారీ చేసి, డిప్లొడియా బంక తెగుళ్లను అరికట్టవచ్చు.



మామిడితోట



బంక తెగులు సోకిన చెట్టు కాండం